సాక్షి ఆదిలాబాద్

మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024



ప్రేమోన్మాదికి ఉరే సరి

ఖానాపూర్‌లో యువతిని హత్యచేసిన ప్రేమోన్మాది శ్రీకాంత్‌కు ఉరిశిక్ష శిక్ష వేయాలని ప్రజాసంఘాలు, అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. 8లో▸

సంత్ రవిదాస్ జయంతి అధికారికంగా నిర్వహించాలి

కైలాస్‌నగర్: సద్గురు సంత్ గురు రవిదాస్ మహారాజ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడంతో పాటు ఆ రోజు సెలవు దినంగా ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర మోచి సంక్షేమ సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలశంకర్ కృష్ణ, పట్టణ బాధ్యులు ఓటర్కార్ రాజేశ్వర్, సంతోష్, బైరీ ప్రణీత్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి వినతి పత్రం అందజేశారు.

గరిష్టం/కనిష్టం
35.0/20.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపించనుంది.

న్యూస్‌రీల్

'సేవాలాల్' జయంతి వేడుకల ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న బంజారా నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో మంగళవారం నిర్వహించనున్న సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉత్సవ కమిటీ సభ్యులు, బంజారాకులస్తులు సోమవారం దగ్గరుండి ఏర్పాట్లను పరిశీలించారు. కమిటీ అధ్యక్షుడు సురేశ్‌మాట్లాడుతూ..వేడుకలకు జిల్లా నలుమూలాల నుంచి బంజారా కులస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట నరేశ్‌జాదవ్, పవన్‌నాయక్, బలిరాం తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నాచేస్తున్న అంగన్‌వాడీలు

కైలాస్‌నగర్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, సీఐటీయూ నాయకులు ఆశన్న, చిన్నన్న, స్వామి, జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: విదేశాల్లో ఉన్నత చదువు నిమిత్తం వెళ్లాలనుకునే అర్హులైన మైనార్టీ వర్గాల (ముస్లిం, క్రిస్టియన్, సిక్, బుద్ధిస్ట్, జైన్, పార్శి)నుంచి సీఎం ఓవర్సీస్ పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి రమేశ్‌రాథోడ్ ప్రకటనలో తెలిపారు. అమెరికా, ఆస్ట్రేలియా, లండన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, సింగపూర్ దేశాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్, డాక్టర్ చదువాలనే వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 1 ఆగస్టు 2023 నుంచి 31 డిసెంబర్ 2023 కాలంలో (ఫాల్ సీజన్) అడ్మిషన్ తీసుకున్న అభ్యర్థులు తమ ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో www.telanganaepass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉండాలని తెలిపారు. ఆసక్తి గల వారు మార్చి 20లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.



బండి సంజయ్



ఈటల రాజేందర్



కమలం కదనరంగం

- విజయ సంకల్ప రథయాత్రతో..
- పార్లమెంట్ ఎన్నికలకు శంఖారావం
- రేపు నిర్మల్ నుంచి జిల్లాలోకి ప్రవేశం
- బోథ్, ఆదిలాబాద్‌లో బండి సంజయ్.. ఇంద్రవెల్లి, ఉట్నూర్‌లో 'ఈటల' పర్యటన
- పదుల సంఖ్యలో బీజేపీ టికెట్ ఆశావహులు

జిల్లాలో రథయాత్ర ఇలా..

నిర్మల్ నుంచి బుధవారం ఈ యాత్ర జిల్లాలోని నేరడిగొండలోకి ప్రవేశిస్తోంది. కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ఇందులో పాల్గొననున్నారు. నేరడిగొండలో రోడ్‌షో సాగనుంది. అనంతరం ఇచ్చోడ చేరుకొని అక్కడ రోడ్‌షో, పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొంటారు. అక్కడి నుంచి గుడిహత్నూర్ మీదుగా ఆదిలాబాద్ పట్టణానికి చేరుకుంటారు. పట్టణంలో రోడ్‌షో, పబ్లిక్ మీటింగ్, మేధావులతో సమావేశం సాగనుంది. ఆ రోజు రాత్రి ఆదిలాబాద్‌లోనే బస చేస్తారు. పార్టీ సీనియర్ నేత ఈటల రాజేందర్ గురువారం మూడోరోజు యాత్రలో పాల్గొంటారు. ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ చేరుకొని నాగోబా ఆలయాన్ని సందర్శిస్తారు. అనంతరం ఇంద్రవెల్లి, ఉట్నూర్‌లో రోడ్‌షో సాగుతుంది. ఉట్నూర్‌లో లంబాడా కమ్యూనిటీతో సమావేశమవుతారు. అక్కడినుంచి ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని జైనూర్‌లోకి ఈ యాత్ర ప్రవేశిస్తుంది.

సాక్షి,ఆదిలాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కమలం పార్టీ కదనరంగంలోకి దిగింది. ఆ పార్టీ ఆధ్వర్యంలో విజయ సంకల్ప రథయాత్ర తలపెట్టారు. ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ముథోల్ నియోజకవర్గంలో గల బాసరలో మంగళవారం ప్రారంభమవుతుంది. అక్కడ అసోం సీఎం హిమంతబిశ్వశర్మ, రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ పాల్గొననున్నారు. బుధవారం ఈ యాత్ర నిర్మల్ మీదుగా జిల్లాలోని నేరడిగొండలోకి ప్రవేశిస్తోంది. బోథ్, ఆదిలాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల మీదుగా సాగనుంది. రాష్ట్రంలోని పార్లమెంట్ నియోజకవర్గాలను ఐదు క్లస్టర్లుగా విభజించి ఈ యాత్ర చేపడుతుండగా, కుమురంభీం క్లస్టర్ పరిధిలో ఆదిలాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లోని 21అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా ఈ యాత్ర కొనసాగనుంది. పది రోజుల పాటు సాగే యాత్ర నిజామాబాద్‌లో ఈనెల 29న ముగియనుంది. పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకులంతా వేర్వేరు రోజుల్లో ఈ యాత్రలో పాల్గొననున్నారు.

ఆశావహులు అనేకం..

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీజేపీ బలంగా ఉంది. గత ఎన్నికల్లో ఈ పార్టీ నుంచి సోయం బాపూరావు ఎంపీగా గెలిచిన విషయం తెలిసిందే. గడిచిన శాసనసభ ఎన్నికల్లో ఈ సెగ్మెంట్ పరిధిలోని ముథోల్, నిర్మల్, ఆదిలాబాద్, సిర్పూర్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు గెలిచిన విషయం విదితమే. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ పరంగా సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావుకే టికెట్ దక్కుతుందా.. లేనిపక్షంలో ఎలా ఉంటుందనేది ప్రస్తుతం పార్టీలో ఆసక్తికరంగా మారింది. మరో వైపు పలువురు ఆశావహులు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ రాజేశ్‌బాబు, ఆదిలాబాద్‌కు చెందిన డాక్టర్ సుమలత, సినీనటుడు అభినవ్ సర్దార్, ఆదివాసీ మహిళానేత శ్రీలేఖ, ఆసిఫాబాద్‌కు చెందిన కోట్నాక విజయ్ టికెట్ ఆశిస్తున్నారు. ఇదిలా ఉంటే పార్టీలో ఎలాంటి దరఖాస్తు ప్రక్రియ లేకపోయినప్పటికీ ఇప్పటివరకు సుమారు 40 మంది వరకు టికెట్ ఆశిస్తూ పలువురు నేతలకు దరఖాస్తులు అందజేశారు. మొత్తంగా బీజేపీలో ఆశావహుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

మరో 52 ఎస్‌హెచ్‌జీలు

- 520 మంది మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదం
- గడువుకు ముందే లక్ష్యాన్ని సాధించిన మెప్మా
- బ్యాంకు లింకేజీ రుణ టార్గెట్ కూడా పూర్తి



ఎస్‌హెచ్‌జీ సమావేశంలో సభ్యులు

కైలాస్‌నగర్: అర్హులైన యువతులు, మహిళల స్వయం సమృద్ధితో పాటు ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) అండగా నిలుస్తోంది. 18 ఏళ్ల వయస్సు నిండిన యువతులు, కొత్తగా పెళ్లైన మహిళలకు ఆ దిశగా లబ్ధి చేకూర్చాలని భావించిన ప్రభుత్వం అలాంటి వారితో కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లా కేంద్రంలో 51 సంఘాల ఏర్పాటు లక్ష్యంగా నిర్దేశించగా 52 ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా ప్రత్యేక దృష్టి సారించిన మెప్మా సిబ్బంది నిర్దేశిత గడువుకు 40 రోజుల ముందుగానే లక్ష్యాన్ని పూర్తి చేశారు.

ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా

స్వయం సహాయక సంఘాల్లోని అతివల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. స్వయం సమృద్ధితోపాటు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం స్త్రీ నిధి, బ్యాంక్ లింకేజీ ద్వారా వ్యక్తిగత, గ్రూపులకు రుణాలను అందజేస్తోంది. వాటిని సక్రమంగా చెల్లించిన వారికి రుణ పరిమితి మరింత పెంచి మంజూరు చేస్తోంది. ఈ రుణాలను అర్హులైన ప్రతీ మహిళ సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొత్తగా సంఘాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. కొత్తగా పెళ్లి చేసుకుని వచ్చిన వారు, 18 ఏళ్లు నిండిన యువతులను సంఘ సభ్యులుగా చేర్చాలని పేర్కొంటూ 51 సంఘాల లక్ష్యంగా నిర్ణయించారు. ఆ దిశగా దృష్టి సారించిన మెప్మా సిబ్బంది నిర్దిష్ట గడువుకంటే ముందుగానే లక్ష్యాన్ని అధిగమించారు. ఒక్కోసంఘంలో పదిమంది సభ్యులతో కూడిన 52 సంఘాలను ఏర్పాటు చేశారు.

రుణాల్లోనూ టార్గెట్ పూర్తి

కొత్త సంఘాల ఏర్పాటులోనే కాదు బ్యాంకు లింకేజీ, వ్యక్తిగత రుణాల మంజూరులోనూ మెప్మా లక్ష్యాన్ని అధిగమించింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను వ్యక్తిగత రుణాలు 24 యూనిట్లకు గాను రూ.18.5లక్షలుగా నిర్ణయించగా 29 యూనిట్లకు రూ.33.30లక్షల రుణాలు అందజేశారు. బ్యాంకు లింకేజీ కింద 335 సంఘాలకు రూ.16.28 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించగా 265 సంఘాలకు గాను రూ.25.74కోట్ల రుణాలు అందజేసి లక్ష్యాలను అధిగమించారు. అయితే ఆర్థికంగా లక్ష్యాన్ని చేరుకున్నప్పటికీ సంఘాల పరంగా 70 సంఘాలకు నిరాశనే మిగిల్చారు.

ఆరు నెలల తర్వాత లబ్ధి

కొత్తగా ఏర్పాటైన సంఘాల్లోని సభ్యులు రెగ్యులర్‌గా పొదుపు పాటించడంతో పాటు సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలి. సంఘానికి సంబంధించిన పొదుపు, జమ, ఖర్చుల వివరాలతో కూడిన రికార్డులు సక్రమంగా నిర్వహించుకోవాలి. ఇలా ఆరు నెలల పాటు సంఘాన్ని సమర్థవంతంగా నడుపుతూ పొదుపు చేసుకున్నట్‌లైతే ప్రభుత్వ పరంగా వారికి లబ్ధి చేకూరనుంది. ఈ సంఘాల్లోని సభ్యులకు మెప్మా ద్వారా బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధితో పాటు వ్యక్తిగత రుణాలు అందజేస్తారు. వాటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆర్థికాభివృద్ధి దిశగా ముందుకు సాగే అవకాశముంటుంది. ఒక్కో సంఘంలో పది మంది చొప్పున 520 మంది మహిళలకు ప్రయోజనం కలుగనుంది.

ప్రతీ మహిళ ఎస్‌హెచ్‌జీలో చేరాలి



ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా కొత్త స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నాం. తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉండి 18 ఏళ్లు నిండిన ప్రతీ యువతి, మహిళ అర్హులే. ఎస్‌హెచ్‌జీలో సభ్యురాలిగా చేరితే వారికి పొదుపు అలవాటుతో పాటు ఆర్థికాభివృద్ధి సాధించేలా బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తాం. అర్హులైన మహిళలు, యువతులు మెప్మా సిబ్బందిని సంప్రదించి ఎస్‌హెచ్‌జీలో సభ్యురాలిగా చేరవచ్చు.

– శ్రీనివాస్, మెప్మా డీఎంసీ, ఆదిలాబాద్

'గ్రీవెన్స్'కు పలువురు అధికారులు డుమ్మా..!

కైలాస్‌నగర్: కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా అధికారులంతా ఉదయం 10గంటలకు హాజరుకావాలి. మధ్యాహ్నం 1.30 గంటల వరకు తప్పనిసరిగా ఉండాలనే కలెక్టర్ ఆదేశాలున్నా అధికారులు లెక్కచేయడం లేదు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు పలువురు డుమ్మా కొట్టడమే ఇందుకు నిదర్శనం. జెడ్పీ సీఈవో, డీపీవో, డీఎస్సీడీవో, డీఈవో, డీఎంహెచ్‌వో, ట్రాన్స్‌కో ఎస్ఈ, మున్సిపల్ కమిషనర్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ వంటి ప్రధాన శాఖల అధికారులంతా గైర్హాజరు కావడం గమనార్హం. మార్కెటింగ్ ఏడీ ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ఉదయం 11.30గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుని బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. డీఈవో, మార్కెటింగ్ ఏడీని పిలువగా వారు అందుబాటులో లేరు. ఏడీని పిలువాలని డీఎస్‌వోతో ఫోన్ చేయించిన సదరు అధికారి రాకపోవడం గమనార్హం. దీనిపై ఆగ్రహించిన ఆమె గైర్హాజరైన, అందుబాటులో లేని వారి వివరాలతో నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని చెప్పడం విశేషం.



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఈ వారం 19 అర్జీలు..

సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 19 అర్జీలు అందాయి. వ్యవసాయ, ఉపాధి కల్పన, పంచాయతీ, ఎస్సీ కార్పొరేషన్, పోలీస్ శాఖలకు సంబంధించి ఒక్కో అర్జీ రాగా, బ్యాంకు రుణాలకోసం 2, రెవెన్యూకు సంబంధించి 12 దరఖాస్తులు అందాయి. వాటిని ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులకు అందజేస్తూ సకాలంలో పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

ఆర్‌యూబీ పనులు కొనసాగించాలని ఆందోళన

- ఎమ్మెల్యే శంకర్ హామీతో విరమణ

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని తాంసి బస్టాండ్ వద్ద గల రైల్వే ట్రాక్‌పై చేపట్టిన అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను యథావిధిగా కొనసాగించాలని ట్రాక్‌కు అవతల గల పలు కాలనీల ప్రజలు డిమాండ్ చేశారు. స్థానిక పంజాబ్‌చౌక్‌లోని పాత జాతీయ రహదారిపై సోమవారం రాస్తారోకో చేపట్టారు. కలెక్టర్ రావాలని నినదించారు. రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. డీఎస్పీ జీవన్‌రెడ్డి అక్కడికి చేరుకుని ఆందోళన విరమించాలని కోరారు. కాగా, ఎమ్మెల్యే శంకర్ వారి ఆందోళనకు మద్దతు తెలిపారు. పట్టణాభివృద్ధికి వ్యాపారులు సహకరించాలని కోరారు. సర్వీస్ రోడ్డు నిర్మాణంలో మడిగెలు కోల్పోతున్న వ్యాపారులకు ప్రభుత్వ పరంగా పరిహారం అందించేలా చూస్తానన్నారు. మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించి త్వరితగతిన పనులు ప్రారంభించడంతో పాటు త్వరలోనే ఆర్‌యూబీ పూర్తయ్యేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ప్రజలు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పలు కాలనీవాసులతో పాటు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్, డీఎస్పీ జీవన్‌రెడ్డి

జై శివాజీ..



పట్టణ పురవీధుల గుండా శోభాయాత్ర



శివాజీ విగ్రహం

ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి శోభాయాత్ర నిర్వహించారు. హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన యాత్రలను ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం, రాంలీలా మైదానంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హిందువులంతా ఐక్యతతో మెలగాలని పిలుపునిచ్చారు. ఛత్రపతి శివాజీ జయంతిని అధికారికంగా నిర్వహించాలని అసెంబ్లీలో ప్రస్తావించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని పేర్కొన్నారు. పట్టణ పురవీధుల గుండా సాగిన శోభాయాత్రకు యువత పెద్ద ఎత్తున హాజరయ్యారు. డీజే చప్పుళ్ల మధ్య నృత్యాలు చేశారు. – ఆదిలాబాద్



శివాజీ విగ్రహానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

టెన్త్, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ శ్యామలాదేవి
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష

కైలాస్‌నగర్: త్వరలో నిర్వహించనున్న పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటర్ పరీక్షలు ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 21,527 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా.. వారి కోసం 30 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్1 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగుతాయన్నారు. 10,507 మంది పరీక్షలకు హాజరుకానుండగా 53 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలను సాఫీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు పరీక్షల సమయానికి అనుగుణంగా బస్సులు నడుపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. అలాగే కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, తగిన సంఖ్యలో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కేంద్రంలోనూ తప్పనిసరిగా తాగునీరు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. ఈ ఏడాది ఫలితాలను మెరుగుపర్చేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా సంక్షేమ వసతిగృహాల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా సంక్షేమాధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఆర్డీవో స్రవంతి, డీఐఈవో రవీందర్, డీఈ దేవేగౌడ, డీబీసీడబ్ల్యూవో కె.రాజలింగు, ఎస్సీ సహాయ సంక్షేమాధికారి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు



మాట్లాడుతున్న శ్యామలాదేవి

హెచ్‌ఎంఐఎస్‌లో వివరాలు నమోదు చేయాలి

- డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం (హెచ్‌ఎంఐఎస్) పోర్టల్‌లో హెచ్ఐవీ పరీక్ష, లైంగిక సంబంధ వ్యాధులు తదితర వివరాలను పూర్తిగా పొందుపర్చాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో పొందుపర్చే విషయంపై జిల్లాలోని వివిధ పీహెచ్‌సీలకు చెందిన ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లకు సోమవారం శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో గర్భిణులు, ప్రజల నుంచి పూర్తి సమాచారం సేకరించి పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ లైంగిక సంబంధిత వ్యాధులు, హెచ్ఐవీ పరీక్ష తదితర అంశాలను అదనపు డీఎంహెచ్‌వో గజానన్ వివరించారు. పోర్టల్‌లో నమోదు చేసే విధానాన్ని జిల్లా డాటా మేనేజర్ రమణ వివరించారు. కార్యక్రమంలో డీపీఎంవో వామన్‌రావు, ఎయిడ్స్ కంట్రోల్ యూనిట్ సిబ్బంది రాజశేఖర్, సతీశ్, ఎల్టి రమణాచారి, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

క్లుప్తంగా

25న కొలాం సేవా సంఘం ఎన్నికలు



మాట్లాడుతున్న సోనేరావ్

ఆదిలాబాద్‌రూరల్: ఈ నెల 25న కొలాం సేవా సంఘం జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం నేతలు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో గల అశోక బుద్ధ వీహర్‌లో కుమ్రం సూరు యువ సేన జిల్లా అధ్యక్షుడు కుమ్ర రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బేల మండలం మాసాల (కే)లో ఇటీవల కొలాం సేవా సంఘం ఎన్నికలను నిర్వహించడాన్ని కోర్ కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కొంతమంది వారి వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆ ఎన్నికలు నిర్వహించారన్నారు. ఆ కమిటీని కొలాం కులస్తులు నమ్మవద్దన్నారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి కొడప నగేష్, జిల్లా మాజీ అధ్యక్షుడు కొడప సోనేరావ్, ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షుడు టేకం గణేశ్, నాయకులు మడావి కిషన్, కొడప భీంరావ్, మడావి జంగు, టేకం ముత్త, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలు

ఆదిలాబాద్: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాలోని యువతకు ఈ నెల 20న జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్‌వైకే కోఆర్డినేటర్ సుశీల్ బడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా నిర్వహించనున్న పోటీలకు 18 నుంచి 25 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అందులోనూ విజేతలుగా నిలిస్తే జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. జాతీయస్థాయి పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.2 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.1.5 లక్షలు, తృతీయ బహుమతి రూ.లక్ష, ఇద్దరికి ప్రోత్సాహక బహుమతులు రూ.50 వేల చొప్పున అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బాల కార్మికుడి గుర్తింపు



బాల కార్మికుడితో ఐసీపీఎస్ సిబ్బంది

లక్ష్మణచాంద(నిర్మల్): ఐసీపీఎస్ అధికారులు సోమవారం మండల కేంద్రంలో బాల కార్మికుడిని గుర్తించారు. ఓ వ్యక్తి వద్ద పనిచేస్తున్న బాల కార్మికుడిని ఐసీపీఎస్ (ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీమ్) సిబ్బంది గుర్తించి బాలలను పనిలో పెట్టుకోవద్దని యజమానికి సూచించారు. పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది మమత, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల ఇలవేల్పు గజ్జలమ్మ

- కొలనులో వెలిసిన గ్రామ దేవత
- 21 నుంచి ఆలయ వార్షికోత్సవం

కుంటాల(ముధోల్): కుంటాల ఇలవేల్పు గజ్జలమ్మ ఆలయ 4వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ నెల 21న భగవతి ప్రార్థన, విశేష సంకల్పం, మహాగణపతి పూజ, పుణ్యా వచనం, యాగశాల ప్రవేశం, సంస్కారం–క్షేత్రపాలక, నవగ్రహ, యోగిని, కర్కరి, సర్వతోభద్ర మండల స్థాపన అగ్ని ప్రతిష్ఠ, స్థాపిత దేవత హోమం, కుంకుమార్చన, మంత్రపుష్పం, ప్రసాద వితరణ, 22న నిత్యవిధి, యజ్ఞ కార్యక్రమం, శ్రీ గజ్జలమ్మ కల్యాణం, రథోత్సవం, హారతి, మంత్రపుష్పం, ప్రసాద వితరణ, 23న నిత్యవిధి, మహాపూర్ణ హారతి, కుంభాభిషేకం, మహిళలచే బోనాల పండుగ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

కలలోకి వచ్చి.. కోనేరులో ప్రత్యక్షమై..

కుంటాల గ్రామానికి సుమారు 150 ఏళ్ల చరిత్ర ఉంది. ఇప్పటివరకు ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న కుంటాల ప్రస్తుతం నిర్మల్ జిల్లాలో కొనసాగుతోంది. పూర్వం కుంటాలకు చెందిన మూసరి వంశస్తులు నిత్యం అడవికి వేటకు వెళ్లేవారు. అందులో ముత్యం అనే వ్యక్తికి ఒకరోజు నీటిగుంటలో విగ్రహం కనిపించింది. రాత్రి అతని కలలోకి వచ్చి నాపేరు గజ్జలమ్మ అని.. ఢిల్లీ సమీపంలోని గజాపురం నుంచి వచ్చానని.. నన్ను కొలిస్తే అంతా మంచే జరుగుతుందని చెప్పింది. మరుసటిరోజు విషయాన్ని గ్రామస్తులకు వివరించాడు. దీంతో గ్రామస్తులు నీటిగుంటలో ఉన్న విగ్రహాన్ని బయటకు తీసి ఓ చెట్టుకింద ప్రతిష్ఠించారు. ఆ తర్వాత కొన్నిరోజులకు చిన్నగుడి కట్టించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సహకారంతో రూ.51 లక్షలు వెచ్చించడంతో ఆలయాన్ని పునర్నిర్మించారు. కుంటాలలో సుమారు 4,611 మంది జనాభా ఉండగా కులమతాలకతీతంగా సగానికి పైగా జనానికి అమ్మవారి పేర్లు ఉండడం విశేషం.



శ్రీ గజ్జలమ్మదేవి



కుంటాలలోని గజ్జలమ్మదేవి ఆలయం

నైవేద్యం..ప్రత్యేకం..

ప్రస్తుతం ట్రెండు మారినా ఆ గ్రామంలో పుట్టిన పిల్లలకు గజ్జలమ్మ నామకరణం చేయడం ఆనవాయితీగా వస్తోంది. పెళ్లిళ్లు, తలనీలాలు, తదితర శుభకార్యాలు జరిగితే గజ్జలమ్మకు బోనం సమర్పించడం తప్పనిసరి. అంతేకాకుండా అమ్మవారికి నైవేద్యం సమర్పించడంలో ప్రత్యేకత ఉంది. గంగనీళ్ల జాతర సందర్భంగా అమ్మవారి నగలను దిలావర్‌పూర్ మండలంలోని న్యూసాంగ్వి గోదావరికి వెళ్లి శుద్ధిచేస్తారు. అప్పటినుంచి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. మాఘమాసంలో రాత్రి వండిన అన్నం ఉదయం పెరుగుతో చలిబోనంగా సమర్పిస్తారు. దేవలదండు అమావాస్యను పురస్కరించుకుని అమ్మవారి జాతర నిర్వహిస్తారు. ఉల్లిగడ్డలు, పుట్నాలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. ప్రతీ ఆదివారం బోనాలు, చిన్నపిల్లలకు తలనీలాలు, తులాభారం వేయిస్తారు. ప్రతీ ఆదివారం మహారాష్ట్ర, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు తరలివస్తారు. ముంబై, హైదరాబాద్ నగరాల్లో స్థిరపడిన వారు అక్కడ గజ్జలమ్మ ఆలయాలు నిర్మించారు.

అందరికీ అమ్మవారి పేర్లే



మాది అంబకంటి. మా అమ్మగారి ఊరు కుంటాల. మా తల్లిదండ్రులు మా అన్నయ్య పేరు గజ్జారాం, నా పేరు గజ్జవ్వ అని నామకరణం చేశారు. మా అమ్మ పేరు కూడా గజ్జవ్వనే. మా ఇంట్లో అందరికీ అమ్మవారి పేర్లే ఉన్నాయి.

– గోపు గజ్జవ్వ, అంబకంటి

బోనం సమర్పిస్తాం



మాది ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ గ్రామం. మా ఇంటి దైవం గజ్జలమ్మ. మా ఇంట్లో శుభకార్యాలు చేస్తే కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి తప్పకుండా బోనం సమర్పిస్తాం.

– చట్ల గజ్జయ్య, బజార్‌హత్నూర్, ఆదిలాబాద్

రోజూ గుడికి వెళ్తా..



మా అమ్మానాన్నలు నాకు గజ్జారాం అని పేరు పెట్టారు. కుంటాలలో వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నా. నాకు అమ్మవారి పేరు పెట్టడం చాలా సంతోషంగా ఉంది. ప్రతీరోజు ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటున్నా.

– అవధూత్ గజ్జారాం, దౌనెల్లి

అదృష్టంగా భావిస్తున్నా



మా తాతయ్య మూసరి ముత్యం. అతనికి గజ్జలమ్మ దేవి కలలో కనిపించింది. గ్రామస్తులకు చెప్పడంతో గుడి కట్టించారు. ప్రతీ ఆదివారం ఆలయంలో భక్తుల రద్దీ ఉంటుంది. అమ్మవారికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా.

– నగేష్, అర్చకుడు

అంతర్జాతీయ ఆన్‌లైన్ వర్క్‌షాప్ ప్రారంభం



వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ ఆన్‌లైన్ వర్క్‌షాప్ ప్రారంభించారు. 'డేటా సైన్స్ యూజింగ్ పైథాన్' అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌ను కళాశాల ప్రిన్సిపాల్ పి.భరద్వాజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అఖిల భారత సాంకేతిక విద్యా మండలి, బ్రెయినోవిజన్ సంస్థల సహకారంతో ఈనెల 19 నుంచి 23 వరకు ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్న విద్యార్థుల వర్క్‌షాప్‌లో పలు విద్యాసంస్థలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు రాజ్‌కుమార్, వీరస్వామి, రాజన్న, సుజయ్, అనిల్ కుమార్ చౌహాన్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి రాజేశ్, లెక్చరర్లు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హరితనిధి నర్సరీని తనిఖీ చేసిన పీసీసీఎఫ్



నర్సరీని పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ రాకేష్ మోహన్

నర్సాపూర్(జి): నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండల కేంద్రం శివారులో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరితనిధి వన నర్సరీని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) రాకేశ్‌మోహన్ డోబ్రియాల్ సోమవారం తనిఖీ చేశారు. మొక్కల సంరక్షణకు చేపడుతున్న చర్యలను అటవీ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీసీఎఫ్ శర్వాణన్, డీఎఫ్‌వో రాంకిషన్, ఎఫ్ఆర్‌వో రమేశ్‌రావు, డీఆర్వో ఇర్ఫానుద్దీన్, ఎఫ్ఎస్‌వో అలేఖ్య, ఎఫ్‌బీవో అనుపమ ఉన్నారు.

ప్రేమోన్మాదికి ఉరే సరి



రాస్తారోకోలో పాల్గొన్న నాయకులు

- అఖిలపక్షం, ప్రజాసంఘాల నాయకుల డిమాండ్
- ఖానాపూర్‌లో రాస్తారోకో

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణంలో పట్టపగలు నడిరోడ్డుపై అత్యంత దారుణంగా యువతిని హత్యచేసిన ప్రేమోన్మాది శ్రీకాంత్‌కు ఉరిశిక్ష వేయడమే సరైన నిర్ణయమని, ఆదిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు, అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో అలేఖ్య తల్లిదండ్రులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హత్యకు ప్రేరేపించిన నిందితులపై కూడా కేసులు నమోదు చేయాలన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలన్నారు. కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టాలన్నారు. అధికార పార్టీ నాయకులు ప్రత్యేక చొరవ తీసుకుని అఖిలపక్షాన్ని జిల్లా మంత్రి సీతక్కతో పాటు సీఎం రేవంత్ రెడ్డి వద్దకు తీసుకెళ్లాలని కోరారు. నిందితుడికి శిక్ష పడి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నందిరామయ్య, దుర్గం నూతన్, సునారికారి రాజేశ్, దుర్గం లింగన్న, పీటర్, సురేందర్, ఆత్రం సుగుణ, సమత, నిమ్మల రమేశ్, జన్నారపు శంకర్, గౌరై గంగాధర్, బొమ్మెన సురేష్, నాగెల్లి నర్సయ్య, శైలెందర్, కావలి సంతోష్, బానావత్ గోవింద్, సిద్ధార్థనాయక్, మునుగూరి భూమన్న, ద్యావతి రాజేశ్వర్, నేత్య శ్యామ్, మేస సతీశ్, మురళీకృష్ణ, తిరుమలేశ్, గజేందర్, సరోజ, శోభ, రాసమల్ల అశోక్, శ్రావణ్, అజయ్, శేషాద్రి, త్రివేందర్, నవీన్, మహిపాల్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

మనోవికాసానికి సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రారంభిస్తున్న డైరెక్టర్ సతీష్‌కుమార్

భైంసా: విద్యార్థుల మానసిక వికాసానికి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడుతాయని బాసర ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్‌కుమార్ అన్నారు. ట్రిపుల్‌ఐటీలో సోమవారం కౌన్సిలింగ్ డిపార్ట్‌మెంట్ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులు విద్యాపరమైన ఒత్తిడి, త్వరిత ఉద్వేగాలకు లోను కావడం జరుగుతోందన్నారు. కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు భరతనాట్యం, వీణవాయిద్యం, శాస్త్రీయ నృత్యాలు, జానపద గీతాలు, ఇతర ప్రదర్శనలు చేశారు. వర్సిటీ చీఫ్ వార్డెన్ శ్రీధర్, కౌన్సిలర్లు నాగలక్ష్మి, శ్రీలక్ష్మి, శివకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలని ఆందోళన



వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

కుబీర్(ముధోల్): ఈ నెల 15న సేవాలాల్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో యువకుడిని చితకబాదిన కేసులో అసలైన నిందితులను అరెస్టు చేయాలని సోమవారం వివిధ తండాలకు చెందిన గిరిజనులు ఆందోళన నిర్వహించారు. కేసులో 40మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి విచారణ జరిపి అట్రాసిటీ కేసు నమోదు చేసి నలుగురు యువకులను కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల రిమాండ్ విధించింది. 40మందిపై ఫిర్యాదు చేస్తే కేవలం నలుగురినే జైలుకు పంపడాన్ని నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సోము, సీఐలు నైలు, శ్రీనివాస్ హామీ ఇచ్చారు. మాజీ సర్పంచులు రాథోడ్ శంకర్, గోపీచంద్, నాయకులు జాదవ్ గణపతి, గులాబ్, కంలేష్, పండిత్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని నెహ్రూ చౌక్‌కు చెందిన ప్రభాకర్ (35) ఈనెల 15న అదృశ్యమైనట్లు టూటౌన్ ఎస్సై రమణారెడ్డి తెలిపారు. మహారాష్ట్రలోని ఇంగన్‌ఘాట్‌లో కూలీగా పనిచేస్తున్న ప్రభాకర్ ఈనెల 15న తన తండ్రి దయానంద్‌తో కలిసి ఆదిలాబాద్ పట్టణంలోని తన నివాసానికి వచ్చాడు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయల్దేరి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. సోమవారం దయానంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఉపాధికోసం వెళ్లి..అచేతనంగా మారి..

- గల్ఫ్‌దేశంలో అనారోగ్యం పాలైన జిల్లా వాసి
- కదలలేనిస్థితిలో స్వరాష్ట్రానికి తరలింపు..
- నిమ్స్‌లో చేర్పించిన గల్ఫ్ సమితి నాయకులు



రాజేశ్వర్

నిర్మల్‌ఖిల్లా: మామడ మండలం పొన్కల్ గ్రామానికి చెందిన చెరుకు రాజేశ్వర్ కొంతకాలంగా గల్ఫ్ దేశంలోని ఖతార్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగు నెలలక్రితం అనారోగ్యానికి గురై చలనంలేని స్థితికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ గల్ఫ్ సమితి అధ్యక్షుడు మైదం మధు, సంఘ కార్యవర్గ సభ్యులు ఖతార్ దేశంలోని అహ్మద్ ఆసుపత్రికి వెళ్లి నిరంతరం పర్యవేక్షించారు. అక్కడి ఇండియన్ ఎంబసీ సహకారంతో స్వదేశానికి పంపించేందుకు కావాల్సిన పత్రాలు సమకూర్చారు. సోమవారం హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేర్పించారు. గల్ఫ్ దేశంలో పని చేసిన కాలానికి గాను అందాల్సిన సర్వీస్ డబ్బులు, అదనంగా చికిత్సకు అవసరమయ్యే ఖర్చు వివరాలను అక్కడి కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి ఆర్థిక సహాయం అందే విధంగా తోడుగా నిలిచారు. రాజేశ్వర్ కుటుంబానికి అండగా నిలిచిన తెలంగాణ గల్ఫ్ సమితి నాయకులకు ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల కృతజ్ఞతలు తెలియజేశారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



సాయికృష్ణ (ఫైల్)

బోథ్: మండలంలోని నాగుగూడ వద్ద సోమవారం బైక్ అదుపుతప్పి బజార్‌హత్నూర్ మండల కేంద్రానికి చెందిన పైడిపల్లి సాయికృష్ణ (35)మృతి చెందినట్లు ఎస్సై రాము తెలిపారు. బజార్‌హత్నూర్ నుంచి మహారాష్ట్రలోని చికిలి గ్రామానికి చెందిన తన బంధువులను దింపటానికి బైక్‌పై వెళ్లి తిరుగు ప్రయాణంలో నాగుగూడ వద్ద వాహనం అదుపుతప్పి కిందపడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని మావల సమీపంలో జాతీయ రహదారి 44పై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందినట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు. జైనథ్ మండలానికి చెందిన చౌదరి రవీందర్ (29), అజయ్, సమద్ ద్విచక్ర వాహనంపై ఆదివారం దేవుడి దర్శనానికి మహారాష్ట్రకు వెళ్లారు. సోమవారం తిరుగు ప్రయాణంలో హరిత వనం పార్కు సమీపంలో వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. రవీందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. అజయ్, సమద్‌కు గాయాలు కావడంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అజయ్‌కు మెరుగైన వైద్య చికిత్స కోసం నిజామాబాద్ తరలించారు. మృతుడు రవీందర్ సోదరుడు మహేందర్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. భీంపూర్ మండలం కేస్లాగూడకు చెందిన రాథోడ్ సురేశ్ బోరుబావికి విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయించాలని, పెంబికి చెందిన గుగ్లోవత్ సురేశ్ అవ్వల్ అంబులెన్స్ వాహనానికి డ్రైవర్‌గా నియమించాలని కోరారు. పింఛన్, డబుల్ బెడ్‌రూం, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, ఈఈ భీంరావు, ఏవో రాంబాబు, ఆర్వీవో గంగాధర్, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

సృజనాత్మకత కోసం డ్రామా పోటీలు

- పరీక్షల సహాయ కమిషనర్ సిద్ధ పద్మ

నిర్మల్‌రూరల్/సోన్: ఆంగ్లభాష నైపుణ్యాలతోపాటు వి ద్యార్థుల్లో దాగిన సృజనాత్మకతను వెలికి తీయడానికి డ్రామా పోటీలు దోహదపడతాయని జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ సిద్ధ పద్మ పేర్కొన్నారు. ఎస్సీఈఆర్టీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) ఆధ్వర్యంలో సోఫీనగర్‌లోని కేజీబీవీలో సోమవారం ఉమ్మడి జిల్లా డ్రామా పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా నిర్మల్, భైంసా డిగ్రీ కళాశాలల అసిస్టెంట్ ప్రొఫెసర్లు రవికుమార్, సుభాష్, వశిష్ఠ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అఖిలేష్ కుమార్ సింగ్ వ్యవహరించారు. ప్రభుత్వ పాఠశాల విభాగం నుంచి సోన్ మండలం కడ్తాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, కేజీబీవీ పాఠశాల విభాగం నుంచి మంచిర్యాల జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎల్టా సంఘం జిల్లా అధ్యక్షుడు కదార్ల రవీంద్ర, ప్రధాన కార్యదర్శి భూమన్న యాదవ్, అసోసియేట్ అధ్యక్షులు వేణుగోపాల్, రతన్ కుమార్, నిర్మల్, సోన్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు లత, సుజాత, తదితరులు పాల్గొన్నారు.



ప్రథమస్థానం సాధించిన విద్యార్థులు

కిక్కిరిసిన నిర్మల్ బస్టాండ్





నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్ సోమవారం ప్రయాణికులతో కిక్కిరిసింది. మేడారం జాతరకు నిర్మల్ డిపో నుంచి దాదాపు 29 బస్సులను పంపించడంతో బస్సుల కొరతతో ప్రయాణికులు మరింత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సుల కోసం ప్రయాణికులు పడిగాపులు కాశారు. బస్టాండ్ ప్రాంతంలో ఎక్కడ చూసినా ప్రయాణికులతో కిక్కిరిసి కనిపించింది. ఆ దృశ్యాలను 'సాక్షి' కెమెరాలో క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



